క్లుప్తంగా

ఫిజియోథెరపీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హైదరాబాద్ నిజాం వైద్యకళాశాల ఫిజియోథెరపీ వైద్యులు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించి, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపీ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు శరీరంలోని భాగాలు బెణికితే ఉపాధ్యాయులు ప్రథమ చికిత్సను అందించవచ్చని, అందుచేత ఫిజియోథెరపీపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఫిజియోథెరపిస్ట్ జ్ఞానశేఖర్, రిసోర్స్‌పర్సన్స్ అయ్యప్పరెడ్డి, నయోమి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుకు అనుకుని ఉన్న వేప చెట్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రం సమీపంలో శ్రీకాళహస్తి- కేటీరోడ్డును అనుకుని ఉన్న వేపచెట్టుతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. వేపచెట్టు కొమ్మలు రోడ్డుకు అడ్డుగా ఉండడంతో భారీ వాహనాలు ఎదురు ఎదురుగా వచ్చినప్పుడు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి. లోడ్ వాహనాల్లోని సరుకులు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి వేపచెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యానికి సహకరించండి

నారాయణవనం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ ఈవో షణ్ముగం సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో పిచ్చి మొక్కలను తొలగించి, కాలువలను శుభ్రం చేశారు. దోమలు వృద్ధి చెందకుండా మెలాథిన్ ఆయిల్ బాల్స్‌ను కాలువల్లో వేశారు. సాయంత్రం ఫాగింగ్ చేశారు.

నేత్ర శోభితం.. నారసింహుని పుష్ప ఉత్సవం



రాపూరు: మండలంలోని ప్రసిద్ధ పెంచలకోన క్షేత్రంలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారికి మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి పుష్పయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని స్వామివారి నిత్యాకల్యాణ మండపంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి, వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరులకు 350 కిలోల 20 రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిపి, స్వామి అమ్మవార్లను కోన మాడ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం


పంగూరులో ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి, నాయకులు


వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- చంద్రబాబు పాలనంతా అవినీతే
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించండి
- సిద్ధం కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పంగూరు పంచాయతీ పరిధిలోని పంగూరు, బీసీ, ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఏదైతే మాటిచ్చారో దానికి కట్టుబడి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. 1.4 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే జరుగుతోందని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం తప్ప చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి చేసిందేమీలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీప్రసన్న , బొర్రా నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, వైఎస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు వెంకటకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోలయ్య, మూలయ్య, శివారెడ్డి, నరసింహారెడ్డి, గుణశేఖర్ నాయుడు, చంద్రశేఖర్, కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిరణ్ నాయుడు, మస్తాన్, వెంకటేష్ యాదవ్, రమేష్, మస్తాన్, రాంబత్తెయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

శ్రీకాళహస్తి: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ పవిత్రారెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ, వార్డు వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలను ఆమెను అందజేశారు. వారిని సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని తీసుకు వచ్చారని తెలిపారు. పథకాలు ఈ వ్యవస్థలతో పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందుతున్నాయని పేర్కొన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు చేశారన్నారు. ప్రధానమంత్రి కూడా ఈ సేవలను ప్రశంసించినట్లు గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఈ వ్యవస్థలను అమలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. పేదలందరికీ పథకాలను అందించడంలో వలంటీర్ల పాత్ర శ్లాఘనీయమని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ఎంపీడీవో అలీ, నా యకులు మునిరత్నం, రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెంగల్‌రాయులు, బాలరెడ్డి, గంగిరెడ్డి, వయ్యాల మనోహర్, గురునాథం, నాగార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యం, మనోహర్, రామిరెడ్డి, కిరణ్, గోవిందరెడ్డి, మదన్‌మోహన్, రామచంద్ర, వెంకట్రామన్‌నాయు డు, విజయ్, భాస్కర్, దిలీప్, మునిరాజా, శివారెడ్డి పాల్గొన్నారు.

పల్లికొండేశ్వర ఆలయ మహాశివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు

నాగలాపురం: సురుటుపల్లిలోని ప్రసిద్ధ శ్రీపల్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఆవిష్కరించారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. తాను తప్పక ఉత్సవాలకు హాజరవుతానని తెలిపారు. తొలుత మంత్రికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం చేయగా, స్వామి వారి ప్రసాదాలను ధర్మకర్తల మండలి సభ్యులు అందించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మునిచంద్రశేఖర్‌రెడ్డి (బాలాజీ రెడ్డి), కార్యనిర్వహణాధికారి ఓ.రామచంద్రా రెడ్డి, పాలకమండలి సభ్యులు ఓ.ఆనంద్, అజయ్ కుమార్, కవిత సందీప్, వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, పార్టీ మండల అధ్యక్షుడు అపరంజి రాజు, సర్పంచ్ చిన్నదురై సుధా, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, శ్యామ్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా రేణుకా పరమేశ్వరి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలోని పట్నూలు వీధిలోని శ్రీరేణుకా పరమేశ్వరి ఆలయంలో మూడు రోజుల వార్షిక ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం ఉదయం అమ్మవారికి అభిషేక పూజలను నిర్వహించారు. సౌరాష్ట్ర మహిళలు సమర్పించిన పసుపు, కుంకుమలతో అర్చనలు చేశారు. పసుపు, కుంకుమతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమను విశేషంగా అలంకరించి ఉయ్యాల సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి తోటలో సుగంధ పుష్పాలతో అలంకరించిన జడకు పూజలు చేశారు. మేళతాళాలతో జడను తోట నుంచి ఆలయానికి తీసుకువచ్చి పసుపుతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమకు అలంకరించారు. అనంతరం ఊంజల్‌సేవను నిర్వహించి, ఆలయానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంచిపెట్టారు. రాత్రి 9 గంటలకు పరిమళ భరిత పుష్పమాలికలతో అలంకరించిన ప్రభపై అమ్మవారు కొలువుదీరి గ్రామవీధుల్లో విహరించారు. చివరి రోజైన ఆదివారం సాయంత్రం మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్య సమర్పణ అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

బాల్య వివాహాలతో అనర్థాలు


టీపీఎంకండ్రిగలో అవగాహన ర్యాలీ

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని, చేసినా, ప్రోత్సహించినా నేరమని ప్రజాప్రగతి ట్రస్టు శ్రీకాళహస్తి డివిజన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం టీఎంపీ కండ్రిగలో శనివారం ప్రజా ప్రగతి ట్రస్టు, స్త్రీశిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యత, పేదరికం, మూఢనమ్మకాలు తదితర కారణాల వల్ల మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడ బాల్యవివాహాలు అడపాదడపా జరుగుతున్నట్లు తెలిపారు. అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు రాకముందే వివాహం జరిపిస్తే భవిష్యత్తులో వారు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశముందన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి సంజీవ రెడ్డి

పిచ్చాటూరు: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంజూరైన సీసీ రోడ్లు వంటి పనులు తక్షణం పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి సంజీవ రెడ్డి మాట్లాడుతూ తమ కార్యాలయానికి మరుగుదొడ్లు నిర్మాణానికి సభ్యులు సహకరించాలని కోరారు. రాయితీలు పొందాలంటే రైతులు ఈ క్రాప్ తప్పక నమోదు చేసుకోవాలన్నారు. పిచ్చాటూరులో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చి స్థలం చూపలేదని సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన తహసీల్దారు హుస్సేన్ సాహెబ్ పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగనన్న


సిపాయి భరోసా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

రేణిగుంట: ఇప్పటి వరకు కేవలం అగ్రవర్ణాలు, పెత్తందార్లు, వ్యాపారవేత్తలకే పరిమితమైన చట్టసభలకు బడుగు, బలహీన వర్గాల వారిని పంపుతూ అణగారిన వర్గాల వారికి దివిటీలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శనివారం రేణిగుంటలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశంలో కేవలం అగ్రవర్ణ పెత్తందార్ల చేతిలోనే చట్టసభలు ఉండేవని, జగనన్న తన పార్టీలో ఎక్కువ సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని సామాన్యులకు ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు బీసీలకు ఎమ్మెల్సీలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమం కోసం నవరత్న పథకాలను అమలు చేస్తూ రూ.2.5లక్షల కోట్లు నగదు నేరుగా పేదల ఖాతాల్లోకి జమ చేసిన రాష్ట్రం దేశంలోనే లేదన్నారు. పేదల సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, వార్డు సభ్యులు ఇన్నసాదన్, ఇరానీ ఖాదర్, గంగమ్మ ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

రేణిగుంట పట్టణం జ్యోతినగర్‌లో గంగాబాయ్, ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ సుబ్రమణ్యం సిపాయి భరోసా పంపిణీ చేశారు. గంగాబాయ్, ఉదయ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకుని ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్‌కు అందజేశారు.

ఉనికి కోసం రెచ్చగొడుతున్నారు


కమ్మకొత్తూరులో టీడీపీ వారు ధ్వంసం చేసిన ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అయ్యింది. స్థానిక సంస్థల మొదలు ఏ ఎన్నికల్లో సత్తా చాటుకోలేకపోయింది. తమ ఉనికిని చాటుకునేందుకు తరచూ వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలను ధ్వంసం చేస్తూ, గొడవలకు దిగుతూ దాడులకు తెగబడుతున్నారు. తిరిగి అధికారపార్టీ వారు దాడులు చేశారని.. కేసులు పెట్టారంటూ ప్రచారం చేసుకుని లబ్ధి పొందేందుకు బొజ్జల సుధీర్‌రెడ్డి నాయకత్వంలో డ్రామాలు మొదలుపెట్టారు. రెచ్చగొట్టే పోస్టులను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు చించి, తామే చించామని గొప్పల చెప్పుకుంటూ గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారు. ఇందులో భాగంగా అక్కుర్తి సమీపంలోని కమ్మకొత్తూరు గ్రామంలో వద్ద వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను శనివారం చించివేశారు. రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విషయం తెలుసుకుని సంయమనం పాటించాలని పార్టీ శ్రేణులకు సూచించారు, టీడీపీ ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

శివయ్య సేవలో ఆర్టీసీ వైస్ చైర్మన్


ఆలయంలో మిద్దెల హరి, అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌మిద్దెల హరి శనివారం దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించారు. స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి.. ప్రణమిల్లిన భక్తకోటి


ఆలయంలో పంచమూర్తుల ఊరేగింపు


విశేష పూజలు


పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల విహారం

మార్మోగిన వేదమంత్రాలు.. మిన్నంటిన శివనామస్మరణల నడుమ స్వర్ణముఖి నదిలో మహాదేవుని త్రిశూల స్నానం తిలకించి భక్తకోటి పులకించింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం మాఘ పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో త్రిశూలం, పంచమూర్తులకు విశేష పూజలు నిర్వహించి స్వర్ణముఖి నది వద్దకు వేంచేపు చేశారు. విశేష పూజల అనంతరం త్రిశూలానికి వేదోక్తంగా స్వర్ణముఖిలో అవభృథస్నానం చేయించారు. ఇదే సమయంలో భక్తులు స్వర్ణముఖి నదిలో పవిత్రస్నానాలు చేసి తరించారు. అంతకు ముందు నంది వాహనంపై శ్రీగంగాదేవి సమేతంగా సోమస్కందమూర్తి, సింహ వాహనంపై శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

-శ్రీకాళహస్తి

వైభవంగా మాఘ పౌర్ణమి పూజలు

వరదయ్యపాళెం: మాఘ పౌర్ణమి సందర్భంగా వరదయ్యపాళెంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం శ్రీసత్యనారాయణ వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. సమాజంలో చెడు దూరమై ప్రతి ఇంట మంచి జరగాలన్న సంకల్పంతో సామూహిక సత్యనారాయణ వ్రతం సంస్థ ప్రతినిధి రమేష్ తెలిపారు. గణపతి పూజ, జ్యోతి ప్రజ్వలన, సంకల్పం, ఆదిత్య పూజ, నవగ్రహ శాంతి పూజలు చేపట్టారు. పంచామృతాభిషేకం, చందన అలంకరణ, అష్టోత్తరనామ పూజలు, తులసి విశిష్టతను అర్చకులు వివరించారు. తొండమాన్ చక్రవర్తి, కుమ్మరిదాసు చరిత్రను వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు లోకాష్, సునీల్, ఆచార్య ఆనందగిరిజీ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు చేసి, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌లో కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు ఇంటింటి వద్ద కొబ్బరికాయల కొట్టి, కర్పూర హారతులు పట్టారు. ఆలయ ఆవరణలో పండరిభజన, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకగా సత్యనారాయణస్వామి వ్రతం

సత్యవేడు: పట్టణంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీసత్యనారాయణ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన అర్చకులు రవికుమార్ దేవర్ ఆధ్వర్యంలో శ్రీస్వామివారికి వేదోక్తంగా అభిషేక పూజలు, అలంకరణలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం సామూహికంగా సత్యనారాయణ వ్రతం జరిపించారు. మాఘమాసంలో సత్యనారాయణవ్రతం చేసుకోవడం వల్ల శుభఫలితాలు లభిస్తాయని అర్చకులు తెలిపారు. భక్తులు ప్రసాదం అందజేశారు.


బీఎన్‌కండ్రిగలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రసాదాల పంపిణీ


హాజరైన భక్తులు


వరదయ్యపాళెం: సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు